సాక్షి
మెదక్
బుధవారం ׀ 11 ׀ అక్టోబర్ ׀ 2023



శరవేగంగా ఈకేవైసీ

ఈకేవైసీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. డీలర్లు లబ్ధిదారుల వేలిముద్రలు సేకరిస్తున్నారు. వివరాలు 10లో ▸



మహిళలకు అండగా..


రుతుప్రేమ కార్యక్రమం మహిళలకు చేరువవుతోంది. దీనిద్వారా పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు. వివరాలు 10లో ▸



భూసార పరీక్షలు తప్పనిసరి

పంట దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు చేయించాలని అగ్రికల్చర్ విద్యార్థులు తెలిపారు. వివరాలు 11లో ▸

మరో చాన్స్ ప్లీజ్



- ఈ ఒక్కసారి చూడండని రిక్వెస్ట్‌లు
- కాంగ్రెస్ నేతల వెంటపడుతున్న బీఆర్ఎస్ నాయకులు
- ఫోన్లు చేసి బతిమిలాడుతున్న ఎమ్మెల్యే దంపతులు

ఒక్క చాన్స్ ప్లీజ్.. మరో చాన్స్ ప్లీజ్.. అనే డైలాగులు మామూలుగా సినిమాల్లో వినిపిస్తుంటాయి. ఇప్పుడు ట్రెండ్ మారింది. ఈ పదాన్ని ప్రస్తుతం రాజకీయ నాయకులు కూడా వాడేస్తున్నారు. గతంలో ఏం చేశాం.. గెలిపిస్తే ఏం చేస్తామో చెప్పి ఎన్నికల్లో ఓట్లు అడిగేవారు. కానీ ఇప్పుడు ఎన్నికల్లో గెలిచేందుకు ప్లీజ్ ప్లీజ్ అంటూ రిక్వెస్ట్‌లు చేయడం మొదలు పెట్టారు.

మెదక్: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలు బిజీబిజీ అయ్యారు. ఎన్నికలకు మరో 50 రోజుల గడువు మాత్రమే ఉంది. దీంతో ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి వరకు వ్యూహాలకు పదును పెడుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ నేతలకు గాలం వేస్తున్నారు. గ్రామాలు, మండలాల్లోని ముఖ్య నేతలు, క్రియాశీలక కార్యకర్తల జాబితా సిద్ధం చేసి సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మతో పాటు ఆమె భర్త దేవేందర్‌రెడ్డిలు ఫోన్లు చేస్తున్నట్లు సమాచారం.

'అన్నా ..! మరో ఛాన్స్ మాకు ఇవ్వండి. తెలిసో.. తెలియకో మావల్ల ఏదైనా తప్పులు జరిగి ఉంటే అలాంటివి మనసులో పెట్టుకోవద్దన్నా. ప్లీజ్ అన్నా.. ఈసారి మాకు సహకరించండి. మీ మేలు ఎప్పటికీ మరచిపోము. మీరు మా పార్టీలోకి వస్తే సంతోషం.. లేదంటే కాంగ్రెస్‌లోనే ఉంటూ మాకు సహకరించండి అన్నా..' అంటూ కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలను మచ్చిక చేసుకునే పనిలో ఎమ్మెల్యే పద్మ దంపతులు నిమగ్నమయ్యారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నేతలు..

మెదక్ నుంచి మూడోసారి బీఆర్ఎస్ టిక్కెట్ దక్కించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఈ ఎన్నికలలో కూడా గెలిచి హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయనే ధీమాతో ఉన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న అసంతృప్తులను బీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నారు. ఇప్పటికే మెదక్ కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపడిన డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ చిన్నశంకరంపేట మండల అధ్యక్షుడు పోతరాజు రమణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ తదితర నేతలు గులాబీ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. పట్టణానికి చెందిన మరో నేత మామిళ్ల ఆంజనేయులు కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. త్వరలోనే ఆయన బీఆర్ఎస్‌లో చేరతానని ప్రకటించారు. మంత్రి హరీశ్‌రావు కూడా కాంగ్రెస్ రెబల్స్‌తో మాట్లాడుతున్నారు. పద్మను గెలిపించడానికి సహకరించాలని కోరుతున్నారు. కొందరు బీఆర్ఎస్ నేతలకు ఎమ్మెల్యేతో ఏర్పడిన విభేదాలను తొలగించడానికి హైకమాండ్ చేసిన ప్రయత్నం ఫలించ లేదని తెలుస్తోంది.

పకడ్బందీగా పర్యవేక్షణ



యాప్‌లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన ఎస్పీ, అదనపు కలెక్టర్లు

ఎన్నికల ప్రచారంపై కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల ఫిర్యాదులు, అనుమతులు, నామినేషన్ ప్రక్రియలను సులభతరం చేసేందుకు సీ–విజిల్, ఈ–సువిధ యాప్‌లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్‌లతో కలిసి కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అంశం ఎన్నికల నిబంధనలకు లోబడి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల ఫిర్యాదులు, అనుమతులు, నామినేషన్ ప్రక్రియలను సులభతరం చేసేలా సీ–విజిల్, ఈ– సువిధ యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ–సువిధ యాప్ ద్వారా పార్టీ సమావేశాలకు సంబంధించి ముందస్తు అనుమతులు పొందవచ్చని, అదేవిధంగా నామినేషన్ కూడా వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు వారి బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలను సమర్పించాలని కోరారు. ప్రచారాలను ఎప్పటికప్పుడు కమిటీల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులపై బ్యానర్లు వెంటనే తొలగించాలని ఆయన తెలిపారు. వెబ్‌సైట్‌లో రాజకీయ నాయకుల ఫొటోలు తీసేయాలన్నారు. ప్రభుత్వ వాహనాలు రాజకీయ అవసరాలకు వాడరాదని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో ఎన్నికల సందర్భంగా మీడియా సెంటర్‌ను రాజర్షిషా ప్రారంభించారు.

చట్టం పరిధిలో పనిచేయాలి

జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రాతినిధ్య చట్టం – 1951, సెక్షన్ – 127 (అ) ప్రకారం జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు చట్టం పరిధిలో పనిచేయాలని, ముద్రించిన కరపత్రాలు, ఫ్లెక్సీలపై సీరియల్ నెంబర్, అడ్రస్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ప్రింట్ చేసిన తరువాత పబ్లిషర్ పేరు, ప్రింట్ చేసిన కాపీల వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

నాయకుల ఫొటోలు తొలగించాలి



పాపన్నపేటలో జిల్లా వ్యవసాయ అధికారి

పాపన్నపేట(మెదక్): ఫ్లెక్సీలపై నాయకుల ఫొటోలను తొలగించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో షాపుల వద్ద రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించాలని సూచించారు. వచ్చే యాసంగి కోసం యూరియా నిల్వలు ఉంచుకోవాలని, ఈపాస్ ద్వారా విక్రయాలు జరపాలన్నారు.

నిబంధనలు అమలు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నర్సాపూర్: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో నియోజకవర్గంలోని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఇతర ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు చేశారు. రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు వెంటనే తొలగించాలని తెలిపారు. ఇకపై ఏర్పాటు చేయాలంటే అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని చెప్పారు.

పకడ్బందీగా సమ్మెట్1 పరీక్ష



పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఓ

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో సమ్మెట్1 పరీక్షను డీఈఓ రాధాకిషన్ పరిశీలించారు. మంగళవారం పదో తరగతి విద్యార్థులు రాస్తున్న ఇంగ్లీష్ పరీక్షను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ పరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కులను త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, శేషగిరిరావ్ పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం



బీజేపీలో చేరుతున్న గ్రామస్తులు

హవేళిఘణాపూర్(మెదక్): రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మెదక్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన 30 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, కేంద్ర ప్రభుత్వ పథకాలకు యువత ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారన్నారు. కేంద్రం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్చి పనులు చేపడుతుందన్నారు.

12న వాలీబాల్ పోటీలు

శివ్వంపేట(నర్సాపూర్): ఈనెల 12న గోమారం ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్ గంగాల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అండర్–17, అండర్–14 బాలుర, బాలికల జట్టుని ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు 12న ఉదయం 9 గంటల వరకు గోమారం ఉన్నత పాఠశాలకు రావాలన్నారు. ఎంపికైన ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ఈ నెల 17న మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ఎన్నికల సమయంలో పొరపాట్లు జరగకుండా చూడాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల ప్రకారం పనిచేయాలని సూచించారు. ప్రతి అంశంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తమ పరిధిలోని పోలింగ్ బూత్‌లను సందర్శించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాలను గుర్తించి వాటిపై దృష్టిసారించాలని తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా సోషల్ మీడియా పోస్టులపై నిఘా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంచాలి

రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్ల



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్ల

మెదక్ మున్సిపాలిటీ: ప్రజల సమస్యలు ఓర్పు, సహనంతో వినడం ప్రతీ పోలీసు అధికారి బాధ్యత అని రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్ల పేర్కొన్నారు. మంగళవారం ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశానుసారం జిల్లా నూతన పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులు సాఫ్ట్‌స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా సేవలందించాలన్నారు. ధనిక, పేద అనే తేడా లేకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారున్ని సమానంగా చూడాలన్నారు. ప్రజా సేవకులమని గుర్తెరిగి పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. వ్యక్తి, వ్యవస్థ విజయంలో సాఫ్ట్‌స్కిల్స్ ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం వాహనాల తనిఖీలు, నాకాబందీలలో పోలీసులు వ్యవహరించాల్సిన తీరుపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిణి ప్రియదర్శిణి, అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, డీఎస్పీలు ఫణీంద్ర, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల అతిప్రవర్తనతో నేరాలు



మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

సీనియర్ సివిల్ జడ్జి జితేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం మెంటల్ హెల్త్‌డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్‌రెడ్డి పాల్గొని మానసిక దివ్యాంగులు వారి హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. పిల్లల అతిప్రవర్తన వల్లే ఎక్కువగా నేరాలు జరుగుతాయని తెలిపారు. మానసిక రోగాన్ని మందుల ద్వారా నయం చేయవచ్చని, మానసిక వైకల్యాన్ని సరిచేయలేమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చందు నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ మాధురి, సైకాలజిస్ట్ దుర్గమణి, కిరణ్‌రెడ్డి, భాగ్య పాల్గొన్నారు.

పట్టాలిచ్చి భూములు లాక్కుంటారా?

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం



బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: రియల్ ఎస్టేట్ వ్యాపారులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై పేదల గుడిసెలు కూల్చివేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.మల్లేశం మండిపడ్డారు. మంగళవారం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి మాట్లాడారు. 1992లో అసైన్మెంట్ కమిటీ ద్వారా హమాలీ కార్మికులకు ఐదు ఎకరాల 30 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 114 మంది పేదలకు ప్లానింగ్ చేసి పట్టాలు పంపిణీ చేశారని చెప్పారు. పొజీషన్ చూపకుండా నేటికీ ప్రభుత్వ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పాలకులకు ఎన్నికలపై ఉన్న దృష్టి పేదలపై లేదన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు 248/1 సర్వే నెంబర్లలో నివాసం ఉంటున్న పేదలకు రక్షణ కల్పించి పట్టా లేనివారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి, గుడిసెల పోరాట కమిటీ కన్వీనర్ గౌడ్, కో కన్వీనర్ గీత, అంజమ్మ, పాషా భాయ్, జ్యోతి, సిద్దమ్మ, రామమ్మ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి



గోడలపై రాతలను చెరిపేస్తున్న సిబ్బంది

రామాయంపేట(మెదక్): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి ఆధ్వర్యంలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు పట్టణంలోని ఆయా పార్టీలకు చెందిన జెండాలు, పోస్టర్లను తొలగించారు. అలాగే గోడలపై పార్టీలకు సంబంధించిన రాతలను చెరిపేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ప్రజావేదికలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

చిన్నశంకరంపేట(మెదక్): పరిశ్రమ విస్తరణతో కాలుష్య ఇబ్బందులు లేకుండా యాజమాన్యం చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండల పరిధి కామారం గ్రామంలోని అన్ష్ ఇస్పాత్ ఎల్ఎల్‌పీ పరిశ్రమ విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యం ఇచ్చే హామీలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతం మొక్కలు నాటడం, నీటి గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్ పూలపల్లి యాదగిరి మాట్లాడుతూ.. పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. పరిశ్రమ యజమాని సతీష్ అగర్వాల్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామన్నారు. పరిశ్రమ నుంచి ఎలాంటి కాలుష్యం వెదజల్లకుండా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ కుమార్ పఠాన్, రామాయంపేట ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆర్.అంజిరెడ్డి, ఉపసర్పంచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనం.. హడావుడిగా ప్రారంభం

- ఎన్నికల కోడ్ భయంతో గ్రంథాలయ భవనం ఓపెనింగ్
- నిధుల లేమితో రంగులు వేయలేదు, కరెంట్ వైర్లు లాగలేదు
- వినియోగించ లేని స్థితిలో బిల్డింగ్



నర్సాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవనం

నర్సాపూర్: ఎన్నికల కోడ్ వస్తుందని బీఆర్ఎస్ నాయకులు హడావిడిగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేశారు. అందులోభాగంగా అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని కూడా ప్రారంభించారు. నర్సాపూర్‌లో నిర్మిస్తున్న లైబ్రరీ భవన నిర్మాణానికి రూ.90లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు ఉన్నంత వరకు పనులు చేపట్టారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లోరింగ్, రంగులు, కరెంటు వైరింగ్ పనులతోపాటు ఫర్నీచర్ సమకూర్చాల్సిన అవసరం ఉంది. ఆ పనులకు సుమారు రూ.25లక్షలు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని వినియోగించే స్థితిలో లేదు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని పూర్తి కాని లైబ్రరీ భవనాన్ని ఈనెల 9న ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ ప్రారంభించారు.

ఇరుకుగా లైబ్రరీ అద్దె భవనం

కొత్త భవనం నిర్మాణ పనులు జరుగుతుండటంతో లైబ్రరీని అద్దె భవనంలోకి మార్చారు. అది ఇరుకుగా ఉండటంతో పుస్తకాలు భద్రపరిచేందుకు సరిపడా స్థలం లేక సిబ్బంది, పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త భవనాన్ని వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

గ్రంథాలయ భవనానికి చిన్న చిన్న పనులు చేయాల్సి ఉందని మండల పీఆర్ ఏఈ స్వామిదాస్ తెలిపారు. ఇందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పూర్తి చేస్తామని ఏఈ చెప్పారు.

క్లుప్తంగా

ఇంటి ఎదుట నిలిపిన ఆటో దగ్ధం

నంగునూరు(సిద్దిపేట): ఇంటి ముందు నిలిపిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ సంఘటన మంగళవారం నర్మేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్‌ ఆటోను రోజు మాదిరిగానే ఇంటి ముందు ఉంచాడు. మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఆటోకు నిప్పు పెట్టడంతో వాహనం దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజగోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

జహీరాబాద్‌ టౌన్‌: జహీరాబాద్‌, మొగుడంపల్లి మండలాలోని పలు గ్రామాల్లో పోలీసులు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్‌ కాశీంపూర్‌ గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఆపి వాహనదారులను బ్రీత్‌ ఎనలైజర్‌తో తనిఖీచేసి పట్టుబడిన వారికి జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్‌ నిబంధనలు పాటించకపోయినా, అనుమతి పత్రాలు లేకున్నా చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఆటోబోల్తా.. 17 మందికి గాయాలు

నారాయణఖేడ్‌: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొని బోల్తాపడ్డ ఘటనలో 17 మంది కూలీలు గాయపడ్డారు. సిర్గాపూర్‌ మండలం గైరాన్‌ తండాకు చెందిన 17 మంది కూలీలు చాప్టా(కె) పరిసర గ్రామాల్లో పనులు ముగించుకుని తిరిగి ఆటోలో తమ గ్రామానికి వస్తుండగా ఉజలంపాడ్‌ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారంతా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం నారాయణఖేడ్‌ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన 8 మందిని మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నారాయణఖేడ్‌ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్‌ రాథోడ్‌ ఖేడ్‌, తదితరులు కూలీలను పరామర్శించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్‌ బస్సు

నర్సాపూర్‌ రూరల్‌: బైక్‌ను తప్పించబోయి ఒక ప్రైవేటు స్కూల్‌ బస్సు పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటన నర్సాపూర్‌లో మంగళవారం జరిగింది. మూసాపేట, ఎల్లారెడ్డి గూడ తండాల మీదుగా నర్సాపూర్‌కు వస్తున్న స్కూల్‌ బస్సు బైక్‌ను తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సులో నుంచి పిల్లలను కిందికి దించారు.

ఆర్థిక పరిస్థితులు తాళలేక ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్‌): ఆర్థిక పరిస్థితులు తట్టుకోలేక ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు త్రీటౌన్‌ సీఐ.భాను ప్రకాశ్‌ తెలిపారు. మండల పరిధిలోని ఇండ్ల రవి(28) సుతారి కూలీ పనుల చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆ కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్‌ చిట్టి దేవేందర్‌రెడ్డి పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

మహిళలకు అండగా రుతు ప్రేమ

- ఉచితంగా క్లాత్‌ ప్యాడ్‌లు, సిలికాన్‌ కప్పులు
- ప్రత్యేక యాప్‌ రూపకల్పన
- నెలకు 8 టన్నుల హానికర చెత్త నియంత్రణ

సాక్షి, సిద్దిపేట: రుతుప్రేమ కార్యక్రమం మహిళలకు చాలా చేరువవుతోంది. యువతులు, మహిళలు నెలసరి సమయంలో శానిటరీ ప్యాడ్‌లు వినియోగిస్తారు. వాటి కారణంగా ఏర్పడే టన్నుల కొద్దీ చెత్త, కాలుష్యాన్ని నివారించడానికి సిద్దిపేట మహిళలు ఓ చక్కటి మార్గాన్ని ఆచరించి చూపిస్తున్నారు. మంత్రి టి.హరీశ్‌రావు ఆధ్వర్యంలో సిలికాన్‌ కప్పులు, శానిటరీ క్లాత్‌ ప్యాడ్‌లను ఉచితంగా అందిస్తున్నారు. వాటిని వినియోగిస్తూ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుతూ, పర్యావరణాన్నీ రక్షిస్తున్నారు. ఖర్చును సైతం తగ్గించుకుంటున్నారు. రుతుప్రేమపై ప్రత్యేకంగా యాప్‌ను కూడా రూపొందించారు.

సిద్దిపేటలో తడి పొడి చెత్తలను వేరు వేరుగా సేకరిస్తూ తిరిగి ఉపయోగంలోకి తెస్తున్నారు. తడి పొడి చెత్త, హానికరమైన చెత్త సిద్దిపేట మున్సిపాలిటీకి పెను సవాలుగా మారింది. ముఖ్యంగా శానిటరీ ప్యాడ్‌లు, చిన్న పిల్లల డైపర్లు ఏం చేయాలన్న దానికి సరైన మార్గం దొరకలేదు. అవి భూమిలో కలసిపోవాలంటే కొన్ని సంవత్సరాల సమయం పడుతుంది. కాల్చడం వల్ల హానికర వాయువులు విడుదల అవుతాయి. ఆ సమస్యను పరిష్కరించడానికి పర్యావరణవేత్త శాంతి బృందం క్లాత్‌ ప్యాడ్‌లు, సిలికాన్‌ కప్పులు వినియోగమే సరైన పరిష్కారం అనే నిర్ణయానికి వచ్చింది.



కప్స్‌ను ఉచితంగా అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

రుతు ప్రేమతో

ఈ కార్యక్రమానికి 'రుతు ప్రేమ'అని పేరు పెట్టారు. మహిళలే సైగలు, కోడ్‌ భాషల్లో మాట్లాడుకునే నెలసరిపై సిద్దిపేటలోని ఐదో వార్డులో 2022, ఏప్రిల్‌ 6న ఒకసభ నిర్వహించి మార్పునకు శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామం, వార్డుల్లో మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించి వివరిస్తున్నారు. ఇప్పటి వరకు సిద్దిపేటలో 91 గ్రామాలు, 40 వార్డుల్లో నెలసరి వచ్చే మహిళలకు మెడికల్‌ గ్రేడ్‌ సిలికాన్‌ కప్స్‌ 53,067, యువతులకు 12,358 క్లాత్‌ ప్యాడ్‌లను ఉచితంగా అందజేశారు. సిలికాన్‌ కప్పులను 8 నుంచి పదేళ్ల వరకు వాడుకోవచ్చు. అలాగే క్లాత్‌ ప్యాడ్‌లు అయితే మళ్లీ వాష్‌ చేసుకుని వినియోగించుకోవచ్చు. అలా వాటి వల్ల ఖర్చు కూడా తగ్గుతుంది. ఏడాదికి రూ 1,200 ఆదా చేయవచ్చు. సిలికాన్‌ కప్పులను వినియోగించే విధానంపైనా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అలానే జిల్లా వ్యాప్తంగా మహిళలు, యువతులతో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. రుతుప్రేమ పేరుతో ప్రత్యేక లఘు చిత్రాలను రూపొందించి శానిటరీ ప్యాడ్‌లకు బదులు క్లాత్‌ ప్యాడ్‌లు, సిలికాన్‌ కప్స్‌ను వినియోగించాలని ప్రచారం చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, మహిళా సంఘాలతో సమావేశాలలో కూడా ఆ వీడియోను ప్రదర్శిస్తున్నారు. అనుమానాలు ఉంటే మహిళా వైద్యుల సహాయంతో సందేహాల నివృత్తి కూడా చేస్తున్నారు. ఈ కార్యక్రమం గురించి తెలుసుకుని రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేట జిల్లాలో కూడా మహిళల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు.



రుతుప్రేమ యాప్‌లో ఫొటో అప్‌లోడ్‌ చేస్తున్న ఆర్‌పీలు

రుతు ప్రేమ యాప్‌ ద్వారా ముందుకు

రుతు ప్రేమ కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌పీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు లాగిన్‌ ఇచ్చారు. ఆయా గ్రామాల పరిధిలో మొదట సర్వే నిర్వహించనున్నారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి సిలికాన్‌ కప్స్‌, క్లాత్‌ ప్యాడ్‌లను ఉచితంగా అందజేస్తున్న సమయంలో ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్‌ చేస్తున్నారు. సంబంధిత ఏరియా ఆశా వర్కర్‌, అంగన్‌వాడీ టీచర్‌కు ఎప్పుడెప్పుడు ఎవరేవరికి పీరియడ్‌ డేట్‌ ఉందో సమాచారం వస్తుంది. ఆ సమయంలో కప్‌/క్లాత్‌ ప్యాడ్‌లను వినియోగించాలని సూచిస్తున్నారు. వినియోగించిన మహిళకు ఫోన్‌ ద్వారా నైనా, నేరుగానైనా ఫీడ్‌ బ్యాక్‌ను తీసుకుంటున్నారు. ఇలా తీసుకున్న వివరాలను యాప్‌లో అప్‌లోడ్‌ చేయనున్నారు.

ఇప్పటి వరకు 5లక్షలకు పైగా..

సిద్దిపేటలో క్లాత్‌ ప్యాడ్‌లు, సిలికాన్‌ కప్పుల ద్వారా సుమారుగా 5 లక్షల ప్యాడ్‌లు వృథాగా పడేయకుండా నియంత్రించారు. ఒక్కో మహిళ సగటున నెలకు 8 నుంచి 10 వరకు ప్యాడ్‌లను వినియోగిస్తుంటారు. ఇలా వినియోగించి పడేసే ప్యాడ్‌లు సుమారుగా 50 ప్యాడ్‌లు కిలోన్నర వరకు ఉంటుంది. ఈ లెక్కన ప్రతి నెలా 8 టన్నుల హానికర చెత్తను డంపింగ్‌ యార్డుకు చేరకుండా ఆపగలిగారు.

రుతుప్రేమ లోగో

Ruthu Prema Siddipet

ఆరోగ్యం కోసమే..



డైపర్‌లు, ప్యాడ్‌ల వినియోగం వల్ల రసాయనాలతో ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి. రుతుప్రేమ కార్యక్రమం ద్వారా మహిళలు, యువతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే సిద్దిపేటలో జీరో శానిటరీ వేస్ట్‌ కోసం అడుగులు పడుతున్నాయి.

–డాక్టర్‌ శాంతి, పర్యావరణ వేత్త

మానవ మనుగడకు రుతుచక్రం



రుతుప్రేమ కార్యక్రమంతో దేశానికే ఆదర్శంగా సిద్దిపేట నిలవబోతోంది. మహిళల ఆరోగ్య రక్షణ కోసం రుతుప్రేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మానవ మనుగడను శాసించేది రుతుచక్రమని, రుతుచక్రం లేకుంటే జీవన చక్రమే లేదు. సంపూర్ణ స్వచ్ఛ ఆరోగ్య సిద్దిపేటనే మా లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నాం.

– హరీశ్‌రావు, మంత్రి

నిధులు తరలించడం తగదు

కాంగ్రెస్‌ నేత ఎ.చంద్రశేఖర్‌

జహీరాబాద్‌: నియోజకవర్గానికి వినియోగించాల్సిన నిధులను మంత్రి హరీశ్‌రావు తన సిద్దిపేట నియోజకవర్గానికి తరలించుకుపోతున్నారని మాజీ మంత్రి, కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గం చీఫ్‌ కో ఆర్డినేటర్‌ ఎ.చంద్రశేఖర్‌ విమర్శించారు. మంగళవారం మండలంలోని సత్వార్‌, చిరాగ్‌పల్లి, హోతి(బి), గోవింద్‌పూర్‌, కాశింపూర్‌ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ ఖర్చు చేయాల్సిన నిధులు మంత్రి తన సొంత నియోజకవర్గానికి తరలించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కొన్ని కంపెనీలు ట్యాక్స్‌లు కట్టడం లేదని, కట్టమని అడిగితే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ పార్టీని గెలిపిస్తే రైతులకు రూ.2లక్షల రుణాలను మాఫీ చేస్తుందని హామీ ఇచ్చారు. అందరి భవిష్యత్‌ బాగుండాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు చెందిన వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంట్‌ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎస్‌.ఉజ్వల్‌ రెడ్డి, నియోజకవర్గం కో ఆర్డినేటర్‌ ఎన్‌.గిరిధర్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్‌, ఎంపీపీ ఉపాధ్యక్షుడు వి.రాములు, కాంగ్రెస్‌ నాయకులు పి.నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అక్బర్‌, ముల్తానిపటేల్‌, కండెం నర్సింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎ.చంద్రశేఖర్‌

సైబర్‌ వలలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు

- టాస్కులు కమీషన్‌ల పేరుతో మోసం
- ఇద్దరి నుంచి రూ.34 లక్షలు స్వాహా

పటాన్‌చెరు టౌన్‌: పార్ట్‌ టైం జాబ్‌ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్‌ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి రూ.28 లక్షలు పోగొట్టుకున్నార. ఈ ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లాలాబాయ్‌ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి పార్ట్‌ టైం జాబ్‌ అంటూ తన వాట్సాప్‌కు సెప్టెంబర్‌ 25న మెసేజ్‌ వచ్చింది. దీంతో తన వివరాలను నమోదు చేశాడు. సైట్‌ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్‌ ఐడీ క్రియేట్‌ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్‌ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.28 లక్షలు చెల్లించాడు. సైబర్‌ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్‌ నగదు కూడా చూపిస్తూ వచ్చారు. ఉద్యోగి చివరిగా తమ నగదు, కమీషన్‌ ఇవ్వాలని అడగడంతో వారు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌ పోలీసులను ఆశ్రయించాడు. అదే విధంగా నర్రగూడెంనకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి సెప్టెంబర్‌ 23న వాట్సాప్‌ ద్వారా జాబ్‌ ఆఫర్‌ అంటూ మెసేజ్‌ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్‌ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ. ఏడు లక్షల 90 వేలు ఇన్వెస్ట్‌ చేశాడు. చివరికి తన నగదు, కమీషన్‌ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు అమీన్‌పూర్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిమితికి మించి డబ్బుంటే సీజ్‌



సమావేశంలో పలు సూచనలు ఇస్తున్న ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి దేవుజా

ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్‌: అసెంబ్లీ ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో డబ్బు పరిమితికి మించి రవాణా చేస్తే వెంటనే సీజ్‌ చేయాలని ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి దేవుజా తెలిపారు. పటాన్‌చెరు తహసీల్దార్‌ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ బృందాలతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలించే సమయంలో పాటించాల్సిన నిబంధనలు సిబ్బందికి వివరించారు. పెద్ద ఎత్తున నగదు తీసుకెళ్లే వారు దానికి సంబంధించిన పత్రాలు చూపాలని ఆయన తెలిపారు. అలాగే నిర్వహణ సిబ్బంది తనిఖీలు నిర్వహించాల్సిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడికక్కడ ఈ బృందాలు నిఘా ఉండాలని నగదు రవాణా కాకుండా చూడాలన్నారు.

తాగిన మైకంలో బావిలో పడిన వ్యక్తి

రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

జహీరాబాద్‌ టౌన్‌: తాగిన మత్తులో ఓ వ్యక్తి బావిలో పడ్డాడు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వెనుక ఉన్న పాడుపడిన బావిలో పట్టణానికి చెందిన ఎండీ. నబీ(40) మంగళవారం రాత్రి మద్యం మత్తులో బావిలో పడ్డాడు. ఆ దారిన వెళ్తున్న ఒక వ్యక్తి గమనించి వెంటనే జహీరాబాద్‌ అగ్నిమాపక కేంద్రం, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో అగ్నిమాపక అధికారి ప్రశాంత్‌ తన సిబ్బంది శ్రీనివాస్‌, నర్సింహారెడ్డి, సిద్దయ్యలతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారు చాకచక్యంగా వ్యవహరించి తాళ్ల సహాయంతో బావిలో పడిన నబీని క్షేమంగా బయటకు తీశారు.

కల్లు దుకాణాలపై ఎక్సైజ్‌ అధికారుల దాడులు

నర్సాపూర్‌: అక్రమంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణదారులపై దాడులు జరిపి కేసులు నమోదు చేసినట్టు స్థానిక ఎక్సైజ్‌ అండ్‌ ప్రొహిబిషన్‌ సీఐ పద్మ తెలిపారు. శివ్వంపేట, చండి, చిన్నగొట్టిముక్కల గ్రామాల శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న కల్లు స్థావరాలపై మంగళవారం దాడులు చేసి మూడు కల్లు దుకాణదారులపై కేసులు నమోదు చేశామని ఆమె తెలిపారు.

గ్రీవెన్స్‌ కమిటీ ఎన్నిక

మెదక్‌ కలెక్టరేట్‌: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రీవెన్స్‌ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లాఎన్నికల అధికారి అదనపు కలెక్టర్‌ రమేశ్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ నిబంధనల ప్రకారం పనిచేస్తుందని తెలిపారు. కమిటీ సభ్యులుగా డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌, జిల్లా అడిట్‌ అధికారి రాకేశ్‌, జిల్లా కోశాధికారి చిన్నసాయిలును ఎంపిక చేశామని, జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన అన్ని విషయాలను సుమోటోగా స్వీకరించి వారు పరిశీలిస్తారని పేర్కొన్నారు. అలాగే అత్యవసర నిర్ణయాలు తీసుకుని ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసే అధికారం కమిటీకి ఉంటుందని అదనపు కలెక్టర్‌ రమేశ్‌ తెలిపారు.

ట్రాక్టర్‌ నుంచి ఆయిల్‌ చోరీ



ఆయిల్‌ చోరీని చూపుతున్న బాధిత రైతు

శివ్వంపేట(నర్సాపూర్‌): ఇంటి ఎదుట పార్కింగ్‌ చేసి ఉంచిన ట్రాక్టర్‌ ఇంజన్‌ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 85 లీటర్ల ఆయిల్‌ చోరీ చేసిన ఘటన శివ్వంపేటలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీరుడి వేణు తన ఇంటి ఎదుట ఉంచిన ట్రాక్టర్‌ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్‌తో పాటు కొన్ని పరికరాలు చోరీ చేశారని, వాటి విలువ రూ.30 వేలు ఉంటుందని చెప్పాడు.

విధుల్లోకి చేరిన ఆశా వర్కర్లు

జహీరాబాద్‌ టౌన్‌: వేతనాలు పెంచాలని సమ్మె చేసిన ఆశావర్కర్లు మంగళవారం విధుల్లోకి చేరారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ క్లస్టర్‌ అధికారికి సమ్మె విరమణ లెటర్‌ అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్‌ మాట్లాడుతూ.. రూ.18 వేలకు వేతనం పెంచాలని 15 రోజులు ఆశా వర్కర్లు సమ్మె చేశారన్నారు. హెల్త్‌ డైరక్టర్‌ శ్రీనివాస్‌రావు యూనియన్‌ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యులతో చర్చించి కొన్ని హామీలు ఇచ్చారని చెప్పారు. వేతనంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని సమ్మె కాలానికి సంబంధించి వేతనం ఇస్తామని చెప్పడంతో సమ్మె విరమించి విధుల్లోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్‌ నాయకులు కవిత, అన్నమ్మ, లక్ష్మీ, నిర్మల, తదితరులు ఉన్నారు.



సమ్మె విరమణ లెటర్‌ ఇస్తున్న ఆశా వర్కర్లు

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

కర్ణాటక ఎమ్మెల్యే మనప్ప పిలుపు

హుస్నాబాద్‌: ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కర్ణాటక ఎమ్మెల్యే మనప్ప వజ్జల్‌ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్‌లో జరిగిన బీజేపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్‌ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్‌ ఇంచార్జి మీసాల చంద్రయ్య, హుస్నాబాద్‌ అసెంబ్లీ ప్రభారి గుజ్జ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గోల్‌మాల్‌ గుల్షన్‌!

- మందుబాబులకు అడ్డాగా మారిన గుల్షన్‌ క్లబ్‌
- నిధులు దుర్వినియోగం అయినట్లు విమర్శలు
- 36 దుకాణ సముదాయాలకు కాకి లెక్కలు
- నాలుగేళ్లుగా ఎన్నికలు దాటవేస్తున్న తీరు

మెదక్‌: జిల్లా కేంద్రంలోని గుల్షన్‌ క్లబ్‌ రోజురోజుకూ మందు బాబులకు అడ్డాగా మారిపోతోంది. ఎక్కడ చూసినా తాగిపడేసిన మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. పరిసర ప్రాంతమంతా చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఇక మూత్రశాలల దుస్థితి మరీ దారుణం. పోలీసు నిఘా నీడలో ఉన్న గుల్షన్‌ క్లబ్‌లో అసాంఘిక కార్యక్రమాలు జోరుగా సాగిపోతూనే ఉన్నాయనేది అక్షర సత్యం. క్లబ్‌లో దాదాపు 300 మందికి పైగా సభ్యులు ఉన్నారు. వారిలో కొందరు మాత్రమే కాలక్షేపం కోసం క్లబ్‌కు వస్తుంటారు. అక్కడ ఆడుకోవడానికి రెండు క్యారమ్‌ బోర్డులు, ఒకచెస్‌ బోర్డు మాత్రమే ఉన్నాయి. టేబుల్‌ టెన్నిస్‌ ఉన్నా నిరుపయోగంగా పడిఉంది. అలాగ వాలీబాల్‌ నెట్‌ ధ్వసంమై దర్శనమిస్తుంది.

కొందరికే వీలు..

ఇవన్నీ ఒక వంతు అయితే క్లబ్‌లో ఆడడానికి వీలున్న క్రీడలు మాత్రం కొందరికే సొంతం. మిగతవారికి నో ఎంట్రీ.. వచ్చే వారికి సరిపడా కుర్చీలు కూడా ఉండవు. ఎవరైనా అడిగే ధైర్యం చేస్తే మూకుమ్మడిగా ఒక వర్గం వారు ఎదురుతిరిగి నోరెత్తక్కుండా చేస్తున్నారని ఆరోపణలున్నాయి. క్లబ్‌ వ్యవహారంలో కేవలం నలుగురు పెత్తనం చెలాయిస్తున్నారని అంటున్నారు. వారికి రాజకీయ అండ కూడా ఉండడంతో వారి ఆధిపత్యం కొనసాగుతోందని విమర్శలున్నాయి. ఈ క్లబ్‌కు 36 వాణిజ్య దుకాణాల సముదాయం ఉంది. వాటి వల్ల వచ్చే లక్షల ఆదాయానికి అన్నీ కాకి లెక్కలే... ఒక ఆడిట్‌ ఉండదు.. అడిగివారు లేకపోవడంతో ఆ నలుగురు ఆడిందేఆట... పాడిందే పాటగా మారిందని చాలా మంది వాపోతున్నారు. ఈ క్లబ్‌కు అధికారిక అధ్యక్షుడు ఆర్డీఓ. కార్యదర్శిగా క్లబ్‌ మెంబర్‌ ఎన్నిక ద్వారా నియామకం కావాలి. కాని గుల్షన్‌ క్లబ్‌కు కార్యదర్శిగా ఉన్న సుభాష్‌ నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. దీంతో ఆరునెలల కోసమని సిక్స్‌మెన్‌ కమిటీ వేశారు. కాని నాలుగేళ్లుగా వారే పాతుకుపోయి క్లబ్‌ సొమ్ము అప్పనంగా కాజేస్తున్నారని క్లబ్‌ మెంబర్లే ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మంగళవారం ప్రెస్‌క్లబ్‌ ఆధ్వర్యంలో ఆర్డీఓను కలిసేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడంతో సూపరెండెంట్‌కు విషయాన్ని వివరించారు. త్వరలోనే కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.



మెదక్‌లోని గుల్షన్‌ క్లబ్‌

శరవేగంగా ఈకేవైసీ

రేషన్‌ షాపుల్లో వేలి ముద్రల నమోదు

- ఇప్పటి వరకు 5 లక్షల మందికి పూర్తి
- నమోదు కావాల్సిన వారి సంఖ్య 7,38,169

మునిపల్లి(అందోల్‌): ఆహార భద్రత కార్డుల్లోని సభ్యులకు కచ్చితంగా ఎక్ట్రానిక్‌ నో యువర్‌ కస్టమర్‌ (ఈకేవైసీ) చేయించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియ జిల్లాలో వేగంగా సాగుతోంది. రేషన్‌ షాపుల్లోనే డీలర్ల ద్వారా రేషన్‌ లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించి ఈకేవైసీ చేస్తున్నారు. ఈ నెల బియ్యం పంపిణీ పూర్తి కాగానే ఈ ప్రక్రియను డీలర్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు 5 లక్షల మంది వరకు ఈకేవైసీ చేయించినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇంకా 7,38,169 మంది వేలి ముద్రలు నమోదు చేయాల్సి ఉంది.

కార్డుల్లో ఉన్న సభ్యులంతా ..

కార్డులో ఉన్న సభ్యులందరి వేలిముద్రల నమోదు చేయాల్సిఉంది. అయితే కొందరి వేలిముద్రలు పడకపోవడంతో ఆధార్‌ సెంటర్‌కు వెళ్లి సరి చేయించుకుని ఈకేవైసీ చేయించుకుంటున్నారు. చాలా చోట్ల వృద్ధులు, పిల్లల ఐరిష్‌ తీసుకున్నా సరిపోని పరిస్థితి నెలకొంది. ఐరిష్‌, వేలిముద్రలు సరిపోకపోవడంతో వృద్ధులు, పిల్లల విషయంలో ఆయా కార్డు దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి వృద్ధులు, పిల్లలను రేషన్‌ కార్డుల నుంచి తొలగిస్తారా, వారికిచ్చే బియ్యం అందుతాయా లేదా అన్న ఆందోళన కార్డుదారుల్లో నెలకొంది.

సర్వర్‌ సమస్యలు..

రేషన్‌ కార్డు లబ్ధిదారులకు ఈకేవైసీలో వేలి ముద్ర వేసే సమయంలో సర్వర్‌ డౌన్‌ అవుతుండడంతో గంటల తరబడి వేలి ముద్ర కోసం వేసి చూసే పరిస్థితి నెలకొంటోంది. ఒక రోజులో రెండు వందలు చేయాలనుకున్నా సర్వర్‌ డౌన్‌తో కేవలం వందో, యాభై వరకే చేయగలుగుతున్నామని రేషన్‌ డీలర్లు చెబుతున్నారు.

పేర్లున్నా.. అందని బియ్యం

రేషన్‌ కార్డులో పేర్లుండి 2019లో ఉన్నట్లుండి బియ్యం పంపిణీ కాని వారు ఎంతో మంది ఉన్నారు. కేవలం మన్‌సాన్‌పల్లి గ్రామంలోనే సుమారు 10 మంది ఉన్నారు. ఆన్‌లైన్‌ సమస్య వల్లే బియ్యం అందడం లేదని సంబంధిత అధికారులే చెబుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

ఆధార్‌ అప్‌డేట్‌ లేకుంటే సమస్యే

రేషన్‌ కార్డులు దాదాపు పది సంవత్సరాల క్రితం మంజూరు చేసినవి కావడంతో అలాంటి వారికి ప్రస్తుతం వేలిముద్రలు సక్రమంగా పడకపోవచ్చు. ఇలాంటి లబ్ధిదారులు ఆధార్‌ కార్డులను అప్‌డేట్‌ చేయిస్తే తప్ప ఈకేవైసీ పూర్తి కాదు. పైగా ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా కొత్త రేషన్‌ కార్డులను మంజూరు చేయకపోవడం, రేషన్‌ కార్డులలో మార్పులు చేర్పులు చేయకుండా లబ్ధిదారుల ఈకేవైసీ పరిశీలించడాన్ని కొందరు తప్పుపడుతున్నారు.



మన్‌సాన్‌పల్లిలో ఈకేవైసీ చేయించుకుంటున్న లబ్ధిదారులు

బియ్యం సరఫరా చేయాలి



రేషన్‌ కార్డులో ఎంత మంది ఉంటే అందరికీ బియ్యం సరఫరా చేయాలి. కార్డులో పేర్లుండి కూడా ఉండి వేలి ముద్ర పడడంలేదు. ఈకేవైసీ పూర్తయితేనే బియ్యం సరఫరా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. రేషన్‌ కార్డులో పేరు వచ్చే విధంగా చేసి బియ్యం సరఫరా చేయాలి.

– బగిలి అనిల్‌కుమార్‌

ఈకేవైసీ చేయించుకోవాలి



రేషన్‌ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈకేవైసీని తప్పనిసరిగా పూర్తిచేయించుకోవాలి. వేలి ముద్రలు నమోదుకాని వారి విషయం ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇప్పటి వరకు 5 లక్షల మంది వేలిముద్రలు నమోదు చేశాం. ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

– వనజాత, సివిల్‌ సప్లైస్‌ జిల్లా అధికారి